

కథా కౌముది

# నారద భక్తి సూత్రాలు - మణి న్యాయపతి,Atlanta,GA

*వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 16వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో*

*– నా మొట్టమొదటి కథ విభాగంలో - ప్రశంసాపత్రం పొందిన కథ*

సృష్టిలో మార్పులు సహజం... అలాగే, మనుషుల ఆలోచనల్లో కూడాను..! ఇప్పటికి చాలా రోజులనుంచే ఆధ్యాత్మిక విషయాల మీదకి మనసు మళ్ళుతోంది.! దేవుడు గురించీ, భక్తి గురించీ ఇంకా ఇంకా వినాలనీ, తెలుసుకోవాలనీ తహ తహ పెరిగింది.! వయసు మీద పడుతోంటే ఇలాటివి సహజమేనేమో.

పోయినసారి హైదరాబాద్ వెళ్ళినప్పుడు అక్కడ ఈటీవీలో ‘ఆరాధన‘ అనే భక్తి కార్యక్రమం, ఇంకా అలాంటివి ఎన్నో కార్యక్రమాలు చూసి, చాలా సరదా పడ్డాను. ఇప్పుడు పోనీ ఆ ఛానల్ పెట్టించుకుంటేనో అనిపించింది. సరే మాదే డిష్ నెట్వర్క్. అందులో నాకు కావలసిన తెలుగు ఛానల్ లేదు. ఐతే, ‘డైరెక్ట్ టీవీ‘కి మారాలని ఆలోచన వచ్చింది. (ఇవి రెండూ కూడా ఇక్కడ డిష్ కంపెనీలు). డైరెక్ట్ టీవీలో హిందీ ఛానల్స్ కూడా ఎక్కువే ఇస్తాడు.

ఆలోచనైతే వచ్చింది కానీ, మా ఆయనకి ఎలా చెప్పడం? ఎందుకంటారా? ఏదైనా మార్పులు చేద్దామంటే మా ఆయన ఓ పట్టాన ఒప్పుకోరే అదీ వచ్చిన చిక్కు. ఇందాక అన్నానుకదా. ‘సృష్టిలోనూ, మనుషుల ఆలోచనల్లోనూ మార్పులు సహజం‘ అని. కానీ ఈయన ఎక్కడవాడండీ బాబూ. మామూలు మనుషుల్లా, అంటే మీలాగా, నాలాగా ఎప్పటికీ ఆలోచించరు. నేను ఊరికినే అనను మరి. మా ఆయన ‘వింత మనుషుల్లో ఒకరు‘ అని. ఎప్పుడో ఎవరో అన్నారు కూడానూ. ‘ఐతే ఎలిఎనా (alien)?‘ అని.. అలాగే ఉంది వాలకం చూస్తుంటే మరి.

ఏది ఎలా అయితేనే రేట్లు గురించీ, డీల్స్ గురించీ, ఎక్కువ ఛానల్స్ గురించీ చెప్పి, చివరికి ఎలాగో మా ఆయనని ఒప్పించగలిగాను. కాని ఎవడు చెప్పొచ్చాడూ. హామీ ఏమీ ఇవ్వలేదు కదా ఆయన, మనసు మార్చుకోవనీ అందుకే ఎందుకైనా మంచిదని, రాత్రి పడుకునే ముందే డైరెక్ట్ టీవీ వాడికి ఫోన్ చేసి మాట్లాడేయాలి అనుకుంటూ, ఆ రాత్రి సుఖంగా నిదురపోయాను.

తెల్లవారింది. కాఫీ తాగి, ఫోను పుచ్చుకుని కూర్చున్నాను. వాళ్ళది 24 గంటలు సర్వీసు కదా అని, ఫోను చేశాను. మాటలాడాను కూడాను. ఆ రోజో మరునాడో వచ్చి సెటప్ చేస్తానన్నాడు. సంతోషం పట్టలేకపోయాను. చివరిగా మొత్తం డిస్కౌంట్లతో ఎంత అవుతుందో తెలుసుకుందామని అడిగాను. అన్నీ బాగానే ఉన్నాయి అనుకుంటుంటే అదేమిటీ తెలుగు ఛానల్‌కి $14.99 అంటాడు? నిన్న చూసిరాసుకున్నప్పుడు $9.99 ఉంది. అదే అంటే వాడితోటి, వాడేమో ఈ రోజే రేటు మారింది అని ఏదో గొప్ప ఘనకార్యం చేసినట్టు చెప్పాడు. బెలూన్ లోంచి గాలి తీసేసినట్టు అయిపోయాను నేను.

నాకు నోట మాటరాలేదు. 'దుర్మార్గుడా. దుష్టుడా. ద్రోహీ.' అని మనసులోనే వాడిని దీవించాను. మా ఆయనని ఒప్పించాను కదా అని అనుకున్నంత సేపు పట్టలేదు. అయినా, వాడిని అని ఏం లాభం. మా ఆయన ఒప్పుకున్నారు అంటేనే నాకు వెంటనే తెలియాల్సింది. ఎక్కడో ఏదో లిటిగేషను ఉంటుందని. సరే. నా ఖర్మ అనుకున్నాను. ఇంగ్లీషు, హిందీ ఛానల్స్ పెట్టించి, తెలుగు గురించి తరువాత ఆలోచిస్తానని చెప్పాను. అప్పుడైనా వాడు 'ప్రమోషనల్ డీల్' ఏదైనా చెప్పి ఇస్తాడు అనుకుంటూ కానీ చెప్పానుగా, వాడు దుర్మార్గుడూ, దుష్టుడూ, ద్రోహీ అని. వాడు ఒప్పుకోలేదు. ఇంక వాడితో మాటలు చాలించి, వాడి సొల్లు కబుర్లు కట్టించి, ఫోను పెట్టేశాను. ఆవేళ నేను ఎంత నిరాశ చెందానో, ఎంత బాధ పడ్డానో మాటలలో చెప్పలేను.

ఆ బాధ, ఆ కోపం ఎవరిమీద చూపించను? వెయిట్ చేశాను సాయంత్రందాకా. అబ్బో అంతసేపా, ఎంత ఓపిక ఐనా ఎందుకూ అని అనిపించవచ్చు మీకు. మరి అప్పుడే కదా మా ఆయన ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేది. పాపం, ఆయన రావడమేమిటి 'హలో డియర్' అని మాట పూర్తిచేసే లోపల నేను విరుచుకుపడ్డాను. యాజ్‌యూజ్వల్ ఆయనకి ఏమీ అర్థం కాలేదు. కాసేపటికి నేను కాస్త తగ్గి, ఎలాగో ఏడుపు ఆపుకుంటూ. 'మీ వల్లే ఇలా అయింది' అంటూ మొదలుపెట్టి, నా బాధనంతా వెళ్ళగక్కాను. అంతా విని, చిదానంద స్వామిలాగా ఓ చిరునవ్వు మొహం మీద అంటించుకుని, 'ఓస్ ఇంతేనా దాందేముంది? ఎంత అయితే అంత నీకు కావాలి అనుకున్నప్పుడు పెట్టించేసుకో దాంట్లో అంత అదీ ఇదీ అయిపోవలసింది ఏముందీ? నిన్ను ఎప్పుడయినా నేను కాదన్నానా? '

'ఆం. ఎంత సులువుగా సింపుల్ గా చెప్పేశారు.' అనుకున్నాను. పైకి మాత్రం 'ఇన్నాళ్ళూ ఒప్పుకోలేదుగా నిన్నటి దాకా $9.99 ఉన్నది కాస్తా ఇవ్వాళే పెంచేయాలా వాడు? ఒక్కరోజు ముందు ఒప్పుకుంటే, మీ సొమ్ము ఏం పోయేది? ఇంకొక్క రోజు ఆగితే వాడి సొమ్ము ఏం పోయేది? ఏది ఎలా చూసినా, అన్నీ నాకు వ్యతిరేకంగానే జరుగుతాయి ఎప్పుడూ.'

'అదిగో, ఆ మాటే ఎప్పుడూ అనొద్దన్నాను నిన్ను.'

'ఏమాట?'

'ఎప్పుడూ అన్న మాట ఎప్పుడూ అనొద్దన్నానా?' మళ్ళీ అదే చిదానంద స్వామి నవ్వు. నా మూడ్ బాగుండలేదని ఏదో నన్ను నవ్విద్దామని చూస్తున్నారు కానీ, నాకు మాత్రం ఒళ్ళు మండింది. ఇప్పుడు ఎలా ఈ బాధని నేను భరించడం? మనసు మాత్రం ఒప్పుకోవటంలేదు, చూస్తూ చూస్తూ, అంత పెట్టాలంటే అసలు బాధల్లా వాడు రేటు పెంచేశాడన్న ఉక్రోషం,

సరే ఏం చేస్తాను. నా బాధని అలాగే దిగమింగుకుని, నాకు నేనే సర్ది చెప్పుకున్నాను. హిందీ ఛానల్స్ అన్నీ కొత్తవే. పోనీ ఒకటి రెండూ కాదు, ఏకంగా ఏడు ఇస్తున్నాడు ఎందుకు ఈ ఏడుపూ అనుకున్నాను. 'టైం ఈజ్ ది బెస్ట్ మెడిసిన్' అంటారు కదా కాలం ఎంత లేదన్నా ఏదో విధంగా ఒకదారి చూపిస్తుంది. నాతోనూ అదే జరిగింది.!

మరునాడు వాడు వచ్చి 'సెటప్' చేసిన తరువాత, కొన్నాళ్ళు హిందీ ఛానల్స్ హుషారులో మునిగిపోయాను. ఇలా ఉండగా, వాడు 'ఆస్థా' ఛానల్ ప్రమోషనల్‌గా ఇచ్చాడు. 'ఆహా ఇదేదో బాగుందే తెలుగు కాకపోతే హిందీ. అంతేకదా ఏ భాష అయితేనే

ఆధ్యాత్మిక విషయాల గురించి వినడానికి' అనుకున్నాను. ఈ ఛానల్‌లో ప్రవచనాలు ఎంత గొప్పగా ఉంటాయో నేను చెప్పలేను. మీరు చూడాల్సిందే వినాల్సిందే

ఇంకా ఈ విషయం పూర్తిగా బుర్రలోకి ఎక్కే లోపల, ఆ ఛానల్ కాస్తా తీసి పాడేసాడు. ఇవన్నీ దుష్టలక్షణాలు కాకపోతే ఏమిటి చెప్పండి మరీ? 'అయ్యో ఎందుకు ఇలా చేస్తున్నాడు దేవుడు' అంటూ మళ్ళీ అదే బాధ.

మనలో ఓర్పునీ సహనాన్నీ ఆ దేవుడు పరీక్షిస్తూ ఉంటాడనటానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం. ఈ విషయం మనం తెలుసుకోవడానికే ఇలాంటి పరిస్థితులు కల్పిస్తాడు. ఇదే 'మాయ' అరె ఈ వేదాంతం ఎక్కడిదీ? ఇదేదో బాగానే ఉందే కొద్ది రోజులలోనే నాలో ఇంత మార్పా? ఈ ఆధ్యాత్మిక పరివర్తన చూసి మా అమ్మా - నాన్నా ఎంత సంతోషిస్తారో.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే కొద్దిరోజుల తరువాత, ఆ ఆస్థా ఛానల్ రెగ్యులర్ హిందీ పాకేజిలో కలిపేశాడు. ఆ దేవుడి లీలలు అపారం. ఎంత అదృష్టం. అనుకోసాగాను. చాలా రోజులు గడిచిన తరువాత నా మీద జాలితోటో, ప్రేమతోటో, నాకు నేనే అనుకున్నాను. 'పోన్లే తెలుగు ఛానల్ కూడా పెట్టించేసుకుందాము, ఎన్నాళ్ళు ఇలా నా మనసుని చంపుకోవడం' అని. ఈటీవీలో వచ్చే 'ఆరాధన' ఎంత నచ్చిందో ప్రత్యేకంగా పండగల సమయంలో ఎన్ని కొత్తవిషయాలు చెపుతాడో! వాడు ఇచ్చే పాత బ్లాక్ అండ్ వైట్ తెలుగు సినిమాలు, పాత సినిమా పాటలు కూడా ఎంత బాగుంటాయో. హైదరాబాద్ వెళ్ళినప్పుడు చూశాను కదా!

సరే $14.99నే కదా అని, మనసుకి నచ్చచెప్పుకుని, అంతకు ముందర మా ఆయన 'నీకు నచ్చితే పెట్టించుకో' అన్న మాటలు గుర్తుచేసుకుంటూ, ఏదన్నా డీల్ ఉందేమో చూసి లేదని తెలిసినా, ఆఖరికి ఎలాగైతేనే పెట్టించేశాను. నేను చేసిన పనికి నాకు నేనే 'శభాష్' అనేసుకున్నాను.!

ఇంక ఆ రోజు నుంచీ చూసుకోండీ నేను ఎంత ఉత్సాహంగా ఉన్నానంటే మాటలతో చెప్పలేను. పెట్టించిన రోజైతే పండగలా అనిపించింది అంటే నమ్మండి. మరి పండగల సమయంలోనో అనుకుంటున్నారు కదూ! పెట్టించిన కొద్దిరోజులకే సంక్రాంతి రానే వచ్చింది. ఆ రోజు ఎన్ని కొత్తవిషయాలు విన్నానో తెలుసుకున్నానో మనసుకి హత్తుకుపోయాయి. సరే ఆధ్యాత్మిక కార్యక్రమాలు కాకుండా, పాత సినిమాలు, పాత పాటలు ఎంత బాగుండేవో అవి చూడటానికీ, వినటానికీ కూడా ఎంతో హాయిగా అనిపించేవి. పాత సినిమాలు రాత్రి 10.30కి వేసేవాడు. అవి అయ్యేసరికి ఇంచుమించు అర్ధరాత్రి 1.30 దాటిపోయేది. మొదట్లో, ప్రతీ ఒక్కరోజూ కూడా తప్పకుండా చూసేదాన్ని. తరువాత తరువాత కొత్త మోజు తగ్గి, అబ్బా, ఇంతలేటుగానే బాబూ అనుకుంటూ చాలా మంచి సినిమాలైతే, రికార్డు చేసి తరువాత తీరుబడిగా ఎప్పుడైనా చూసేదాన్ని.

ఇలా రోజూ మన పండగలూ, సాంప్రదాయం, పద్దతులూ, గుళ్ళూ - గోపురాలూ వాటి ప్రాముఖ్యత గురించీ కొత్త కొత్త విషయాలు తెలుసుకోవడం చాలా సరదాగా అనిపించేది. నిత్యం పండగలా రోజులు గడిచిపోసాగేయి.

చిన్నప్పటినుంచీ కూడా అమ్మా - నాన్నలతో పాటు గుడికి వెళ్ళడం బాగా అలవాటు. గుడికి వెళ్ళడం అంటే ఎంత హుషారుగా ఉండేదో. ఇప్పటికీ చాలా సరదాయే. కానీ, ఇక్కడ మరీ దూరాలు ఎక్కువ వెళ్ళాలంటే ఓ రోజంతా దానికే అయిపోతుంది. చిన్నప్పుడు ఆధ్యాత్మిక ప్రసంగాలు బాగానే వినేదాన్ని. భక్తి గురించి కూడా మక్కువ ఎక్కువే. భక్తి కథలు, భక్తి ప్రవచనాలు వింటుంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగేవి. అది ఇప్పటికీ మారలేదు. ఎప్పటికీ కూడా మారదేమో!

ఇలా ఉండగా, మెల్లిగా మనసులో ఎక్కడో 'నారద భక్తి సూత్రాలు' చదివితే బాగుండును అనిపించడం మొదలుపెట్టింది. ఇంటర్నెట్‌లో వెతికాను. ఏవో దొరికాయి కానీ తృప్తిగా అనిపించలేదు. అలా వెదుకుతూనే ఉన్నాను కొన్నాళ్ళు ఎక్కడైనా కొంచెం వివరంగా దొరుకుతాయేమోనని. అలా వెతుకుతూ ఉండగా -

నా బాధను చూడలేకో, నా గోల భరించలేకో, మరి నన్ను కరుణించడానికేనేమో మరి, ఒకరోజు, కాదు కాదు రాత్రి, ఆ నారద మహాముని దయచేశారు. 'నారాయణ నారాయణ' అంటూ చిరునవ్వుతో నా ముందు నిలుచున్నారు.! నిజం, నన్ను నమ్మాల్సిందే మీరు. అఫ్కోర్స్, నాకూ ముందర నమ్మకం కుదరలేదు. నేనెక్కడ, ఆ నారద మహాముని ఎక్కడ? కళ్ళు నులుముకున్నాను. ఇంకా అక్కడే చిరుమందహాసంతో నిలిచి ఉన్నారు. నేను తేరుకుని, 'నారద మహామునీ, నిజంగా మీరేనా! నన్ను అనుగ్రహించడానికి వచ్చారా?' అన్నాను.

ఆయన 'నారాయణ నారయణ' అంటూ చిరునవ్వు నవ్వుతూ, చిడతలు వాయించి, నా చేతులు చాపమని, వాటిల్లో ఒక పుస్తకం పెట్టారు. ఒక్క రెండు క్షణాలు నా గుండె కొట్టుకోవడం మానేసి ఉంటుంది. ఎందుకంటే, యాంత్రికంగా పుస్తకం అందుకున్నానే కానీ, ఏం జరుగుతొందో నాకు అస్సలు స్పృహ లేదు. ఆయన మళ్ళీ 'నారాయణ నారయణ' అంటూ తన మహతిని మీటారు. అప్పటికి కానీ ఈ లోకంలోకి రాలేదు. నా కళ్ళు తుడుచుకుంటూ, ఆహా ఏమి నా అదృష్టం స్వయంగా ఆ నారద మహామునే నన్ను అనుగ్రహించి, నా మనసులో ఉన్న కోరిక తీరుస్తున్నారు. 'నారద భక్తి సూత్రాలు' పుస్తకం స్వయంగా ఆయన చేతులమీదుగా అందుకోవడం. ఇంతకన్నా అదృష్టం ఎక్కడైనా ఉంటుందా?

వెంటనే ఆయనకి నమస్కరించి, పుస్తకం కళ్ళకద్దుకుని, మళ్ళీ కళ్ళు తుడుచుకుంటూ నా భాగ్యానికి మురిసిపోతూ పుస్తకం తెరిచి చూశాను. అరె ఇదేమిటి ఇది ఖాళీ. మళ్ళీ చూశాను మళ్ళీ ఖాళీ. ఎక్కడా ఒక్క అక్షరం కనిపించలేదు. 'ఇదేమిటి నారద మునీంద్రా' అని తల ఎతి చూస్తే మనిషి మాయం అదే, నారద మహాముని మాయం. ఇదేమిటీ ఇప్పుడు ఏం చెయ్యనూ ఎలా? అనుకున్నాను.

అప్పుడు నా దృష్టి పై కవరు పేజీ మీద పడి అక్కడే నిలిచిపోయింది. ఇదేమిటీ ఈ పేరు ఎప్పుడూ వినలేదూ. అక్కడ ఏం చూశాను అనుకుంటున్నారూ? 'అత్తగారి అష్టైశ్వర్య స్తోత్రం' అని రాసి ఉంది. అంటే, నన్ను ఈ పుస్తకం రాయమనా? ఆహా దొరుకునా ఇటువంటి సేవ.

ఠక్కున లేచి కూర్చున్నాను. ఇదేమిటీ, ఇలాంటి కల వచ్చింది. ఇది కలే కాని ఎందుకు వచ్చిందంటారూ?

●●●

Click here to share your comments on this story